ఆధ్యాత్మికం

నేటి నుంచి అయ్యప్ప ఆలయంలో భిక్ష

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం నుంచి జనవరి 8 వరకు ఉదయం తేనీరు, మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం ఆలయం పక్షాన దాతలు, భక్తులు సహాయంతో నిర్వహిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాలందించే దాతలు, భక్తులు ఆలయంలోని అర్చక, సిబ్బందిని సంప్రదించి రశీదు తప్పనిసరి పొందాలని కోరారు.

ఉత్సవమూర్తులకు అలంకారం



దుర్గామాత విగ్రహానికి స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్‌కల్చరల్: కట్టారాంపూర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఆలయంలో దుర్గామాతతో పాటు సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు స్నపనం, అలంకారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగారపు శ్రీనివాస్, అర్చకులు కొమ్మెర రవిశర్మ, తాడూరి సుగుణాకర్ పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం..

- కరీంనగర్ నియోజకవర్గానికి కేటాయింపు
- పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం

కరీంనగర్‌రూరల్: కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఈవీఎం యంత్రాల ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడం సులువుగా మారింది. గతంలో ఎన్నికలంటే బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్లు గుర్తు కొచ్చేవి. పోలింగ్ ముగిసిన అనంతరం భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి తరలించేవాళ్లు. ఓట్లు లెక్కించడం, ఫలితాల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎన్నికల్లో పారదర్శకతను పెంచి, ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఈవీఎంలు, వీవీప్యాట్లు ఉపయోగిస్తున్నారు. ఈనెల 30న పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం చురుగ్గా చేస్తోంది. ఇప్పటికే పోలింగ్ నిర్వహణపై పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

390 కేంద్రాలు..

కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం 27మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. రెండు ఈవీఎంలను ఉపయోగిస్తున్నారు. 390 పోలింగ్ కేంద్రాలకు 975 బ్యాలెట్ యూనిట్లు, 487 కంట్రోల్ యూనిట్లు, 546 వీవీప్యాట్‌లను పోలింగ్ నిర్వహణకు కేటాయించారు. బుధవారం ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మహేశ్వర్‌తో కలిసి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును పరిశీలించారు. ఈవీఎంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



బ్యాలెట్ యూనిట్ పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, రిటర్నింగ్ అధికారి మహేశ్వర్

ఈవీఎం ఎలా పని చేస్తుందంటే..

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 1980లో ఎలక్ట్రానిక్ లిమిటెడ్ హైదరాబాద్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగుళూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) రూపొందించారు. మొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పారోవర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఉపయోగించారు. అనంతరం 2004 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా దేశవ్యాప్తంగా వినియోగించారు.

కరీంనగర్ నియోజకవర్గం వివరాలు	
పోలింగ్ కేంద్రాలు	390
బ్యాలెట్ యూనిట్లు	975
కంట్రోల్ యూనిట్లు	487
వీవీప్యాట్‌లు	546

బ్యాలెట్ యూనిట్(బీయూ)

అభ్యర్థుల పేర్లు, గుర్తులు, ఫొటోలను వరుసగా బ్యాలెట్ యూనిట్‌పై ముద్రిస్తారు. ఒక బ్యాలెట్‌పై నోటాతో కలుపుకొని 16మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశముంది. ఎక్కువ మంది అభ్యర్థులుంటే మరో బ్యాలెట్‌ను లింక్ చేస్తారు.

వీవీప్యాట్..

ఈవీఎం ద్వారా ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించడానికి వీవీప్యాట్ ఉపయోగపడుతుంది. ఓటు వేయగానే సంబంధిత అభ్యర్థి గుర్తును చిట్టీపై ముద్రిస్తుంది. సుమారు ఏడు క్షణాల పాటు చిట్టి ఓటరుకు కన్పిపిస్తుంది. అనంతరం వీవీప్యాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లోకి వెళ్లిపోతుంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వీవీప్యాట్‌లను తొలిసారిగా ఉపయోగించారు.

కంట్రోల్ యూనిట్(సీయూ)

కంట్రోల్ యూనిట్ పూర్తిగా పోలింగ్ అధికారుల ఆధీనంలో ఉంటుంది. పోలింగ్ సమయంలో బ్యాలెట్ యూనిట్‌లో వేసిన ఓటు కేబుల్ ద్వారా కంట్రోల్ యూనిట్‌లో నమోదవుతుంది. పోలింగ్ పూర్తయిన అనంతరం సీజ్ చేసి లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. సీయూలోని సమాచారం ఆధారంగానే ఓట్లను లెక్కిస్తారు.

సమర్థులకే ఓటేయాలి

- అప్పుడే సమాజంలో మార్పు సాధ్యం
- ఉద్యోగాలు కావాలి.. ఉపాధి అవకాశాలు రావాలి
- 'సాక్షి'తో యువత

సాక్షి పీపుల్స్ ఎజెండా

కరీంనగర్‌టౌన్: యువ ఓటర్లు ఎన్నో ఆశలతో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఆరాటపడుతున్నారు. తమ ఓటుతో సమాజంలో మార్పు జరగాలని, సామాజిక స్థితిగతులు మారాలని కోరుకుంటున్నారు. చదువుకొని, ఖాళీగా ఉంటున్నవారికి ఉద్యోగాలు కావాలని, ఉపాధి అవకాశాలు రావాలని ఆశిస్తున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లే నిర్ణయాత్మకంగా మారారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పడరానిపాట్లు పడుతున్నారు. యువత ఓట్లు గంపగుత్తగా కొనుగోలు చేసేందుకు తాయిలాలతో సిద్ధమవుతున్నారు. మరో ఆరు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమర్థులకే ఓటేయాలంటున్న యువత తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

నిజాయితీపరులకే ఓటు



ఈ ఎన్నికల్లో నిజాయితీపరులైన అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఓటు వేస్తాం. కరీంనగర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తారని నమ్మిన వ్యక్తినే ఎన్నుకుంటాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వారే ప్రజాప్రతినిధులుగా ఉండాలి.

– దేవరకొండ శ్రీప్రీతం

యువతలో నిరాశ



అవినీతి రహిత సమాజం కోసం పాటుపడే వ్యక్తి అని నమ్మిన అభ్యర్థికే ఓటు వేస్తాం. ఉద్యోగాలు రాక యువత తీవ్ర నిరాశతో ఉన్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చే నాయకులే మాకు కావాలి.

– ఉప్పుల అభిషేక్

ప్రలోభాలకు లొంగొద్దు



అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల దృష్టంతా యువత ఓట్లపైనే ఉంది. తాయిలాలతో ప్రలోభపెట్టి, గంపగుత్తగా ఓట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ యువత ప్రలోభాలకు లొంగొద్దు.

– రఘురామన్

ఓటు వజ్రాయుధం



కరీంనగర్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. ఆ దిశగా ఆలోచించే అభ్యర్థులకు యువత ఓటు వేసి, గెలిపిస్తే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ఓటు వజ్రాయుధం. సరైన అభ్యర్థికే వేయాలి.

– జి.తేజస్వి

ఓటేయడం మరవొద్దు



నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అనే భావనను యువత వీడాలి. ప్రతీ ఒక్క ఓటు విలువైనదని తెలుసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే అసమర్థులు అందలమెక్కుతారు. సమాజానికి చేటు చేస్తారు.

– కె.గౌతమి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



రమీజ్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ సునీతారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈ నెల 24 నుంచి 26 వరకు 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–14 బాలబాలికల స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నారు. వీటికి కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి రమీజ్ ఎంపికైనట్లు పీఈటీ మహేందర్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో రాణించాడని పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి అభినందించారు. రాష్ట్ర పోటీల్లో పతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

వాహనాల తనిఖీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, త్రీటౌన్ సీఐ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయించినందుకు నోటీసు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన నందిపట్ల రాజేందర్ అక్రమంగా మద్యం విక్రయించినందుకు పోలీసులు గురువారం క్రమశిక్షణ నోటీసులు అందజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామాల్లో మద్యం విక్రయించొద్దని ఆదేశాలు ఉన్నాయని, తహసీల్దార్ ఎదుట సైతం బైండోవర్ చేసినా లెక్క చేయకుండా మద్యం విక్రయించాడని అందుకే నోటీసులు జారీ చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్‌టీయూ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా దేవేందర్‌రావు

సుల్తానాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ఉపాధ్యాయుడు గండ్ర దేవేందర్‌రావును జిల్లా అధ్యక్షుడు మెరుగు సతీశ్, ప్రధాన కార్యదర్శి మంద లశ్రీకాంత్‌రెడ్డి ప్రకటించారు. సుల్తానాబాద్ మండలం నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మడ్డి కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా కొంతం అనిల్, ఫయాజుద్దీన్, జిల్లా కార్యదర్శిగా టంగుటూరి దేవేందర్, జిల్లా కార్యదర్శి వడ్లూరి రమేశ్‌ను నియమించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

కొత్త ఓటర్లకు కార్డులు

- పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ

కరీంనగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులను అధికారులు చైతన్యపరిచి ఓటరుగా నమోదు చేయించారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా 25,029 మంది ఓటర్లుగా నమోదు కాగా.. మొత్తం 10,59,215 మంది ఓటర్లున్నారు. అత్యధికంగా కరీంనగర్ నియోజకవర్గంలో కొత్తగా 13,141, హుజూరాబాద్‌లో 5,044, చొప్పదండిలో 3,644, మానకొండూరులో 3,200 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేసిన అధికార యంత్రాంగం అదేస్థాయిలో ఓటరు కార్డులను ఇంటింటా పంపిణీ చేస్తోంది. కొత్తగా ఓటరు నమోదు చేసుకున్నవాళ్లతో పాటు ఇదివరకే ఓటరు కార్డు కలిగి చిరునామా, ఫొటో తదితర మార్పులు, చేర్పులు చేసుకున్నవాళ్లకు ఎన్నికల సంఘం కొత్తగా ముద్రించిన ఓటరు కార్డులను జారీ చేస్తోంది. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో పోస్టల్ శాఖ ద్వారా ఈనెల 1 నుంచి ఓటర్లకు కార్డులను పంపిణీ చేస్తున్నారు. స్పీడ్ పోస్టు ద్వారా వచ్చిన ఓటరు కార్డులను పోస్టల్ సిబ్బంది ఆయా ఓటర్ల ఇంటికి వెళ్లి అందిస్తున్నారు. జిల్లాకు కొత్తగా 1.11లక్షల ఓటరు కార్డులు రాగా.. ఇప్పటివరకు 1.09లక్షల కార్డులను పంపిణీ చేశారు. మిగతా కార్డులను రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



చెర్లభూత్కూర్‌లో పోస్టల్ సిబ్బంది పంపిణీ చేసిన ఓటరు కార్డులతో కొత్త ఓటర్లు

పాతవారికి కొత్త కార్డులు

ఇంతకుముందే ఓటరు గుర్తింపు కార్డున్న వాళ్లు కొత్తగా కార్డు పొందే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఓటర్లు మీసేవ కేంద్రాల్లో సంప్రదించి ఓటరు జాబితాలోని ఎపిక్ కార్డు నెంబరు ద్వారా కొత్త కార్డు పొందే అవకాశముంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



కొత్తపల్లి: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెహర్‌నగర్, బ్యాంక్‌కాలనీ, డిమార్ట్, వరలక్ష్మీనగర్, సీతారాంపూర్ కొంత భాగం, రెడ్డి ఫంక్షన్‌హాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు టౌన్1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

మహిళా కార్పొరేటర్, ఆమె భర్తపై కేసు

కరీంనగర్ క్రైం: అవసరానికి డబ్బులు తీసుకున్న వారు తిరిగి ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగాడని కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. వారి వివరాల ప్రకారం.. నాయిని శ్రీనివాస్‌రెడ్డి(49) కరీంనగర్‌లోని శ్రీనగర్‌కాలనీలో తన భార్య సరిత, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. మంకమ్మతోటకు చెందిన మహిళా కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, ఆమె భర్త శ్రీనివాస్‌లకు ఈ కుటుంబంతో పరిచయం ఉంది. మూడేళ్ల క్రితం మున్సిపల్ ఎన్నికల సమయంలో అవసరానికి అతని వద్ద రూ.8.5 లక్షలు, మూడున్నర తులాల బంగారు హారం తీసుకున్నారు. ఎన్నికలు ముగిశాక కొన్ని రోజులకు తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగితే దాటివేస్తూ తిప్పుకున్నారు. చివరకు బెదిరింపులకు దిగారు. తన ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో అతను ఒక ఫైనాన్స్ కంపెనీలో లోన్ తీసుకొని, వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 22న కరీంనగర్‌లోని కోర్టు ప్రాంగణంలో క్రిమిసంహారక మందు తాగాడు. కోర్టు సిబ్బంది ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కార్పొరేటర్ జయశ్రీ, ఆమె భర్త శ్రీనివాస్ కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య సరిత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడొద్దు

- కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- గోపాల్‌రావుపేటలో పోలీసులు, సాయుధ బలగాల కవాతు



కవాతును ప్రారంభిస్తున్న సీఐ రవీందర్

రామడుగు: గోపాల్‌రావుపేటలో గురువారం కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, చొప్పదండి సీఐ రవీందర్, ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రజలను కోరారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వరా..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు దానికి కనెక్షన్ ఇవ్వడం మర్చినట్టున్నారు. నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ ఇలా కనెక్షన్ కోసం నిరీక్షిస్తోంది. గద్దె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఇంటి వద్దే ఓటింగ్



తాహెర్‌కొండాపూర్‌లో వృద్ధుడితో ఓటు వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

- తొలిరోజు 86 మందికి అవకాశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల సంఘం వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రవేశపెట్టిన ఇంటి వద్దే ఓటింగ్ విధానం ప్రక్రియను అధికారులు గురువారం నుంచి ప్రారంభించారు. మొత్తం 390 పోలింగ్ కేంద్రాల పరిధిలో 199 మంది ఓటర్లున్నారు. వీరిలో దివ్యాంగులు 68, వయోవృద్ధులు 131 మంది ఉన్నారు. ఇంటి వద్దే ఓటేసేందుకు గురు, శుక్ర, శనివారాల్లో అవకాశం కల్పించారు. కరీంనగర్ కార్పొరేషన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల పరిధిలోని ఓటర్లు ఓటేసేందుకు వీలుగా మొత్తం 9 బృందాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు గురువారం మొత్తం 86 మంది ఓటేయగా.. వీరిలో వయోవృద్ధులు 63, దివ్యాంగులు 23 మంది ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మహేశ్వర్ తెలిపారు.

విద్యుత్ శాఖలో మీటర్ల దందాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ శాఖలో మీటర్ల అక్రమ దందాపై ఉన్నతాధికారులు స్పందించారు. అనుమతి ఒకచోట.. బిగింపు మరోచోట.. పంచాయతీ అనుమతి లేకున్నా మీటర్ల మంజూరు.. అధికారుల పర్యవేక్షణ లోపం.. లైన్‌మెన్ల మాయాజాలం పేరిట సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు విచారణ చేపట్టారు. కొత్తపల్లి సెక్షన్ పరిధి సీతారాంపూర్‌లోని 2–136 ఇంటి నెంబర్‌పై మంజూరైన ఎస్‌ఎంపీ–4102 నెంబర్ గల మీటర్‌ను మున్సిపల్ అనుమతి లేని, కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో నిర్మించిన షెడ్డుకు బిగించారని ఫిర్యాదు చేసిన కొట్టె వినయ్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఇంటి నెంబర్ సరైనదా.. కాదా అన్న విషయంపై తెలుసుకునేందుకు మున్సిపల్ శాఖకు, వినియోగదారుడికి నోటీసు ఇవ్వనున్నట్లు ఏడీఈ తెలిపారు. కమాన్‌పూర్‌లో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు మంజూరు చేసిన మీటర్లపై విచారణ చేపట్టాలని ఏఈను ఆదేశించినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం పంచాయతీ అనుమతులతో మీటర్‌ను పొందితే సరేనని, లేకుంటే వినియోగదారులకు నోటీసులిచ్చి, పంచాయతీ కార్యదర్శి ఇదివరకు జారీ చేసిన నోటీసుల ప్రకారం విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని ఏడీఈ పేర్కొన్నారు.

ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం



సుల్తానాబాద్: ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ఎస్సారెస్పీ క్వార్టర్స్ వెనుక వైపు పైప్‌లైన్ పగిలి నీళ్లు వెళ్లకపోవడంతో కాలనీవాసులు ఎన్నికలను బహిష్కరిస్తామని తహసీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. గురువారం మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి జేసీబీ సహకారంతో లీకేజీ అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నామని, వెంటనే మరమ్మతు చేపట్టామని వివరించారు. అప్పటి వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ ద్వారా నిత్యం వాటర్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.